క్లుప్తంగా

యెహోవా ప్రార్థనా మందిరం వార్షికోత్సవం



వెల్దుర్తి: మండలంలోని రచ్చమల్లపాడులోని యెహోవా ప్రార్థనా మందిరం 9వ వార్షికోత్సవాన్ని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆదివారం యెహోవా ప్రార్థనా మందిరం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. క్రైస్తవులు ఇతరుల పట్ల దయ, కరుణతో ఉండాలన్నారు. క్రైస్తవులు ఏసుప్రభువుని ప్రార్థనలో నిత్యం ఉండి ఆయన ఆశీస్సులు పొందాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు చింతా శివరామయ్య, సర్పంచ్ తోట బ్రహ్మయ్య, మాజీ సర్పంచ్‌లు పార్లపల్లి గాలయ్య, తోట ఆంజనేయులు, నారాయణ, పాస్టర్ గార్లపాటి మల్లయ్య, సిస్టర్ క్లారాలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు రామిరెడ్డి, తోట వీరయ్య, పార్లపల్లి చిన గాలయ్య తదితరులున్నారు. ప్రభుత్వ విప్ పిఆర్కేని శాలువాతో సత్కరించారు.

మంచినీటి చెరువుకు సాగర్ జలాలు విడుదల

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో రక్షిత మంచినీటి చెరువును సాగర్ జలాలతో నింపుతున్నామని సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ తెలిపారు. ఆదివారం మంచినీటి చెరువును సర్పంచ్‌తో పాటు గ్రామ వైస్సార్ సీపీ నాయకులు సందర్శించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోకి తాగునీటి సరఫరా నాలుగు రోజుల పాటు నిలుపుదల చేశామన్నారు. ఎన్నెస్పీ ఏఈ పోట్లూరి లక్ష్మీనారాయణతో ఫోన్‌లో మాట్లాడి సాగర్ జలాలు విడుదలకు తమ వంతు సహకారం అందించాలన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు నూతనంగా రూ.లక్ష వ్యయంతో రెండు విద్యుత్ మోటార్లతో పాటు చిన్నపాటి మరమ్మతులు పూర్తిస్థాయిలో చేయించిన అనంతరం గ్రామంలోకి తాగునీరు విడుదల చేస్తామన్నారు. గ్రామ సచివాలయ ఇంజినీరు రంతు లక్ష్మణ్, వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టేటి రవి, కొణతం ఏరుకలరెడ్డి, ఏసు, తదితరులు ఉన్నారు.


శరవేగంగా జలజీవన్ మిషన్ పనులు

శావల్యాపురం: మండలంలోని చినకంచర్ల గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.50 లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 40 వేల లీటర్ల సామర్థ్యం కల్గిన ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణంతో పాటు 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన సంపు (నీటిని శుద్ధి చేసి నిల్వ ఉంచేది) పనులు జరుగుతున్నాయి. ఇంటింటి నీటి కుళాయి ఏర్పాటు చేయటానికి పైపులు కూడా మంజూరు కాగా, గ్రామంలో 3 కిలోమీటర్ల మేర పైపులైను పనులు పూర్తి చేసిన తదుపరి నీటి కుళాయిలు ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ నిధులు రూ. 2 లక్షలు, బాలవికాస్ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో అవసరమైన యంత్ర పరికరాలతో కూడిన ఆర్వో ప్లాంట్ల నిర్మాణ పనులు మండలంలోని పోట్లూరు, మతుకుమల్లి గ్రామాల్లో పనులు పూర్తి కాగా ముండ్రువారిపాలెం, కనమర్లపూడి గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని ఏఈ చెప్పారు. జలజీవన్ మిషన్ పథకంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూడావత్ ఆకాష్‌ను «సాక్షి» వివరణ కోరగా పనులు పారదర్శకంగా అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నాయన్నారు. త్వరతిగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

చిలకలూరిపేట: నిరుపేదలకు వైద్య సేవలు అందించే లక్ష్యంతో రోటరీ సంస్థ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షుడు కాపు వెంకటరావు చెప్పారు. పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా అందించారు. వైద్య శిబిరంలో మందుల కోసం రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందించిన దేవినేని అశోక్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఆళ్ల వేమనరెడ్డి, జాష్టి రంగారావు, తోటకూర వెంకట నారాయణ, దండా లక్ష్మీనారాయణ, తొట్టెంపూడి వెంకటేశ్వరరావు, డాక్టర్ పీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

గుంటూరు జీజీహెచ్‌లో గుర్తు తెలియని మృతదేహం



సత్తెనపల్లి: పట్టణంలోని వావిలాల పార్కు దగ్గర గల కస్తూర్బా గాంధీ విద్యాలయం వద్ద రోడ్డు మీద పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని ఈ నెల 27న సత్తెనపల్లి టౌన్ పోలీసులు గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆ వ్యక్తి ఈ నెల 29న రాత్రి 10 గంటల సమయంలో మరణించాడు. మృతుడ్ని గుర్తించిన వారు యు. శోభన్‌బాబు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు, సత్తెనపల్లి టౌన్ లేదా 9440796230, 08641 – 232333 నంబర్లకు సమాచారం అందించాలని ఆదివారం కోరారు.

శరవేగంగా హైస్కూల్ నిర్మాణం

- శివారు కాలనీలో విద్యా వెలుగులు
- రెండు నెలల్లోనే సగానికి పైగా పూర్తి
- లెనిన్‌నగర్‌లో రూ. 2.93 కోట్లతో హైస్కూల్ నిర్మాణ పనులు
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషితో సాగుతున్న పనులు

పిడుగురాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తోంది. అందులో భాగంగానే పట్టణంలోని లెనిన్ నగర్‌లో నూతనంగా జిల్లా పరిషత్ హైస్కూల్‌ను మంజూరు చేసి నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతంలో అందరు పేద, నిరుపేద కుటుంబాల వారే నివసిస్తున్నారు. కూలినాలి చేసుకుని వారేఎక్కువ. వారి పిల్లలు సైతం ప్రతి ఒక్కరు విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా విద్య పట్ల ప్రత్యేక ప్రాధాన్యతను కల్పిస్తున్నారు. అందుకు అనుగుణంగా గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి అభివృద్ధి పనులు చేపట్టడంలో ముందడుగు వేస్తున్నారు. ఈ క్రమంలోనే పట్టణంలోని లెనిన్ నగర్‌కు అదనపు తరగతి గదులకు, నూతన హైస్కూల్ నిర్మాణానికి నాడునేడు ద్వారా రూ. 2.93 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఈ ప్రాంతంలో నూతనంగా హైస్కూల్ నిర్మించేందుకు స్థలాన్ని అందించేందుకు దాతలు ముందుకు రాకపోవడంతో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చొరవతో సమీపంలోని ప్రభుత్వ భూమిని గుర్తించారు. అయితే ఆ భూమి గుంతల మయంగా ఉండడంతో ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి తక్షణమే గుంతలను సైతం పూడ్పించి పాఠశాల నిర్మాణానికి ఎకరం స్థలాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పనులు చకచక ముందుకు సాగుతున్నాయి.



లెనిన్ నగర్‌లో నిర్మాణ పనులు జరుగుతున్న హైస్కూల్ భవనం



ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించిన శిలాఫలకం

నిర్మాణంలో 16 గదులు....

నాడు నేడు ద్వారా లెనిన్ నగర్‌లో హై స్కూల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు నెలల్లోనే సగానికి పైగా పనులు పూర్తి అయ్యాయి. మొత్తం 16 గదులు నిర్మించేందుకు గాను రూ. 2.93 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. దీంతో రెండు నెలల్లోనే మొదటి అంతస్తు ఏడు గదులు పూర్తి అయ్యాయి. రెండవ అంతస్తులో మరో ఏడు గదులు నిర్మించేందుకు శ్లాబ్ వేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ రెండవ అంతస్తు పూర్తి అయిన తర్వాత మూడవ అంతస్తులో మరో రెండు గదులు నిర్మించనున్నారు. 340 మంది విద్యార్థులు ప్రస్తుతం 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలో ఉన్న తరగతి గదుల్లో విద్యను అభ్యసిస్తున్నారు. అయితే పాఠశాల నిర్మాణం త్వరగా పూర్తి అయితే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ హైస్కూల్ విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలతో అందుబాటులోకి వస్తోందని అధికారులు తెలుపుతున్నారు.

పేద పిల్లలకు అందుబాటులో కార్పొరేట్ పాఠశాల...



ప్రతి పేద విద్యార్థి కార్పొరేట్ పాఠశాల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలను నిర్మిస్తున్నారు. ఇక్కడ హైస్కూల్ నిర్మాణం పూర్తి అయితే విద్యార్థులకు మరింత సౌకర్యవంతమైన పాఠశాలగా మారుతుంది. పాఠశాల నిర్మాణానికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారు.

– కందులూరి శివయ్య, పట్టణ వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షులు, లెనిన్ నగర్

సౌకర్యవంతమైన పాఠశాల నిర్మాణం



లెనిన్ నగర్‌లో నిర్మిస్తున్న హైస్కూల్ విద్యార్థులకు సౌకర్యవంతంగా నిర్మిస్తున్నారు. మా ప్రాంతంలో ఇప్పటి వరకు హైస్కూల్ లేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యకు ప్రాధాన్యత కల్పించడంతో నాడు నేడు కార్యక్రమం ద్వారా మాకు నిధులు మంజూరు చేసి హైస్కూల్‌ను నిర్మిస్తున్నారు. నిర్మాణ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో హైస్కూల్ నిర్మాణం పూర్తి అయితే విద్యార్థుల భవిష్యత్ బంగారు బాటగా మారుతుంది.

– ఇర్లా గురవమ్మ, విద్యా కమిటీ చైర్మన్, లెనిన్ నగర్ హైస్కూల్

సాగర్‌మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు



విజయపురిసౌత్: ప్రేమ, కరుణ, వాత్సల్యాలను భక్తులకు ప్రసాదించాలని సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ప్రార్థించారు. ఆదివారం సాగర్‌మాత దేవాలయంలో నిర్వహించిన దివ్యబలిపూజా కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. పరిశుద్ధాత్మ అయిన ఏసుక్రీస్తుకు జన్మను ప్రసాదించిన (మరియమ్మ) సాగర్‌మాత ఆశీస్సులు మీ అందరియందున ఉంటాయని, ఆ తల్లిని భక్తి విశ్వాసాలతో పూజిస్తే కోరికలతో పాటు పాపాలు సైతం చెరిగిపోతాయని ఉద్బోధించారు. అనంతరం భక్తులు దేవాలయంలో తలనీలాలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆ తరువాత దేవాలయ ప్రాంగణంలో జరిగిన తేరు ప్రదక్షణలో భక్తులు పాల్గొన్నారు.

గురజాలలో శాంతి ర్యాలీ

గురజాల : మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, హత్యలకు నిరసనగా శాంతి ర్యాలీ నిర్వహించారు. తెలుగుబాప్టిస్టు చర్చి పాస్టర్ రెవ నవజీవన్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దాచేపల్లి–గురజాల మార్కెట్ యార్డు చైర్మన్ కలకండ ఆంద్రెయ్య మాట్లాడుతూ ఈ ఘటనలకు పాల్పడడం హేయమైన చర్య అని నిందితులను అదుపులోకి తీసుకుని తక్షణమే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో బాప్టిస్టు చర్చి సంఘ పెద్దలు, ఉన్నారు.

చిగురించిన ఖరీఫ్ ఆశలు

- వర్షంతో రైతుల హర్షం
- పంటలకు జీవం పోసిన వర్షం

గురజాల : ఆలస్యంగా అయినా వరణుడు కరుణించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ జూన్ నెలలో ప్రారంభమైనా సకాలంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు దిగులు చెందారు. ఎట్టకేలకు వర్షం పడడంతో సాగు చేసేందుకు రైతులు పొలాల్లో నిమగ్నమైయ్యారు. జూలై నెలలో కురిసిన వర్షం 101 ఎం.ఎం వర్షపాతం నమోదు జరిగినట్లు ఆయా శాఖ అధికారులు వెల్లడించారు. దీంతో రైతులు పొలాలను సిద్ధం చేసుకుని విత్తనాలు నాటారు. ముందుగా వేసిన విత్తనాలు మొక్కలు దశ వరకు రావడంతో జూలై నెలలో కురిసన వర్షానికి జీవం పోసినట్లుగా ఉందని రైతులు వ్యక్త పరుస్తున్నారు.

66వేల హెక్టార్లు అంచనా..

గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల ,మాచవరం మండలాల్లో సుమారుగా 66వేల హెక్టార్లుకు పైగా సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖాధికారులు అంచనాలు తెలిపారు. 15వేల హెక్టార్లు వరి, 25వేల హెక్టార్లు పత్తి, 10వేల హెక్టార్లు మిరప, 4 వేల హెక్టార్లు కంది మిగిలిన 12వేల హెక్టార్లులో మిగిలిన పంటలు వేసే ఆలోచనలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది ఖరీఫ్ పంట మార్పిడి జరిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



పత్తి మొక్కలు

అధికారుల సలహాలు తీసుకోవాలి



మండల స్థాయి వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలి. రైతు భరోసా కేంద్రాల్లో ఎల్లప్పుడు రైతులకు అందుబాటులో వ్యవసాయ శాఖకు సంబంధించిన ఉద్యోగులు అందుబాటులో ఉన్నారు. రైతులకు ఎమైనా సమస్యలు ఉంటే సత్వరమే వారి దృష్టికి తీసుకువచ్చి సమస్య పరిష్కరించుకోని మంచి దిగుబడులు సాధించాలి. విత్తన ఎంపిక రైతులకు ఎంతో కీలకమైనది.

– ఎం సంధ్యారాణి, మండల వ్యవసాయాధికారిణి

మణిపూర్ ఘటనలు మానవతకు మాయనిమచ్చ

- యడ్లపాడు గ్రామంలోని పలువురు పాస్టర్ల ప్రత్యేక ప్రార్థనలు
- వివిధ చర్చిల ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ

యడ్లపాడు: ఆదివాసీ మహిళలపై అత్యాచారం.. మారణ హోమం మానవతకు మాయనిమచ్చగా మిగులుతుందని పలువురు పాస్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్ ఘటనకు నిరసనగా మండల కేంద్రమైన యడ్లపాడులో పలు క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. తొలుత పలు చర్చిల్లో ఆదివారం జరిగే ఆరాధనలను ముగించుకుని గ్రామంలోని తహసీల్దార్ కార్యాలయం కూడళ్ల వద్దకు క్రైస్తవులంతా చేరుకున్నారు. ముందుగా స్థానికంగా ఉన్న చర్చీల పరిధిలోని పాస్టర్లు, సంఘపెద్దలు, విశ్వాసులు పాల్గొని మణిపూర్ రాష్ట్రంలో శాంతి నెలకొనాలంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం రచ్చబండ సెంటర్, మెయిన్‌బజార్, 16వ నంబర్ జాతీయ రహదారి, జగ్గాపురం రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. నల్లబ్యాడ్జీలను ధరించి, ప్లకార్డులు పట్టుకుని ఆద్యంతం శాంతి నినాదాలు చేస్తూ ప్రదర్శనను కొనసాగించారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ కేవలం 28 లక్షల జనాభా గల అతి చిన్న రాష్ట్రమైన మణిపూర్‌లో శాంతిభద్రతలను కాపాడటంలో అక్కడి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దారుణంగా విఫలమయ్యాయని మండిపడ్డారు. కుకీ గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి వారిని సామూహికంగా అత్యాచారం చేయటం దేశంలో మహిళల భద్రత ఎంత ప్రమాదకరంగా ఉందో తెలియజేస్తోందన్నారు. దేశంలో మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని మతోన్మాద శక్తుల దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వందల మంది ప్రజల ఊచకోత, వేలాదిమంది మహిళలు అత్యాచారాలకు గురవటం మానవీయతకు మాయని మచ్చగా మిగులుతుందన్నారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరచి మతోన్మాద మూకలను అడ్డుకోవాలని దేశ ప్రజలు శాంతియుతంగా జీవించే పరిస్థితులు కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌సీఎం చర్చి ఫాదర్ సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలో కొనసాగిన ఈ ప్రదర్శనలో లూథరన్ చర్చి పాస్టర్ ఏసురత్నం, పరిశుద్ధాత్మ సంఘం పాస్టర్ సోమయ్య, క్రీస్తు సువార్త సంఘం ఇమ్మానియేల్, ఆయా చర్చిల విశ్వసులు, సంఘస్తులు, మహిళలు, యువకులు, సండేస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



యడ్లపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

నరసరావుపేట: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జి.అలెగ్జాండర్ సుధాకర్ నాయకత్వంలో ఆదివారం జెండాలు చేబూని నిరసన ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ గత మూడు నెలలుగా రిజర్వేషన్ విషయంలో రెండుజాతుల మధ్య జరిగిన గొడవలను పురస్కరించుకొని ఒక జాతికి అక్రమంగా మద్దతు ఇస్తూ మరో జాతిపై దాడులకు మోదీ నాయకత్వంలోని బీజేపీకి చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయన్నారు. జాతుల మధ్య వైరాన్ని సృష్టించి పబ్బం గడుపుకొనే బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపకపోతే దేశమంతా మణిపూర్‌లా తయారవుతుందన్నారు. ఎస్ఎం భాష, సీదా కృష్ణ, రవికిషోర్, దాసరి రాజు, రమేష్, పూర్ణ ,జయపాల్,ప్రవీణ్ పాల్గొన్నారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా మణిపూర్‌లో అమాయక గిరిజన తెగలపై అక్కడి మతోన్మాదులు దాడులు చేస్తున్నారని, ప్రభుత్వం హింసను నిలువరించి దుండగులను కఠినంగా శిక్షించాలని నాదెండ్ల ఎస్‌యూసీఎఫ్ కన్వీనర్ కొప్పూరి శ్రీధర్, పాస్టర్ బి.మోహనరావు చెప్పారు. నాదెండ్లలో యునైటెడ్ క్రిస్టియన్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఆదివారం శాంతిర్యాలీ నిర్వహించారు. 20 మంది పాస్టర్‌లతో నాదెండ్ల లూథరన్ చర్చి నుంచి తిమ్మాపురం రోడ్డులోని అంబేడ్కర్ కాలనీ చర్చి వరకూ శాంతిర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో క్రిస్టియన్, గిరిజనులపై మతోన్మాద దాడులు జరగటం ఆందోళనకరమన్నారు. అక్కడి బీజేపీ ప్రభుత్వం తెగల మధ్య వైరాన్ని రాజేసి హింసాకాండకు కారణమైందని ఆరోపించారు. ఇరువురు కుకీ తెగ స్త్రీలను నగ్నంగా నడిపించిన ఉదంతం యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. గత కొన్నేళ్లుగా దేశంలో ముస్లింలు, క్రైస్తవులపై పథకం ప్రకారం దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుల మతాలకు అతీతంగా ప్రజలంతా ఐకమత్యంగా ఇలాంటి దుర్మార్గాలను నిలువరించాలని కోరారు. పాస్టర్ అబ్రహం, విజయకుమార్, బి.జాన్‌వెస్లీ, బి.హనోక్, బి.సుందరకుమార్, ఆర్.మోజేష్, జి.లెవీ, జేమ్స్‌పాల్, దయారత్నం, డి.మోషే, స్థానిక సంఘ పెద్దలు, యువకులు ఉన్నారు.



నాదెండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘ నాయకులు, పాస్టర్లు

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

సత్తెనపల్లి: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని భీమవరం రోడ్డులో గల రైల్వే ట్రాక్‌పై ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని లెనిన్ నగర్‌కు చెందిన వై.శ్రీనివాసరావు (51) కార్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం వెళ్లదీస్తున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమార్తెకు వివాహమైంది. కుటుంబ కలహాలు, అప్పుల కారణంగా శ్రీనివాసరావు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

మహిళ మెడలోని నల్ల పూసల బంగారు గొలుసు అపహరణపై ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు కొరిటపాడుకు చెందిన పుష్పావతి కుమార్తెతో సత్తెనపల్లిలో బంధువుల ఇంటికి వచ్చారు. పని ముగించుకొని తిరిగి కుమార్తెతో వెళుతూ గుంటూరు బస్‌స్టాప్ సెంటర్‌లో ఆగారు. ఈలోగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి పుష్పావతి మెడలోని నాలుగు సవర్ల నల్లపూసల బంగారు గొలుసును అపహరించుకు పోయారు. దీనిపై ఆమె పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ యు.శోభన్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

అర్ధరాత్రి అదృశ్యం.. ఉదయం బావిలో శవమై తేలిన వైనం

యడ్లపాడు: ఆస్తి తగాదాల నేపథ్యంలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మండలంలోని కోట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. మృతుని బంధువుల కథనం ప్రకారం కొండవీడు గ్రామానికి చెందిన కరీంబాబు (45) కొద్దికాలంగా గుంటూరులోని ఆనందపేట 8వ లైన్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం మొహర్రం కార్యక్రమాన్ని తిలకించేందుకు స్వగ్రామానికి వచ్చారు. అదేరోజు రాత్రి 11.30 నుంచి కుటుంబ సభ్యులకు కనిపించకుండా పోయాడు. అదృశ్యమైన కరీంబాబు ఆదివారం గ్రామంలోని బావిలో శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. భార్య సర్తాజ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. అయితే కరీంబాబు తల్లి ఇమామ్ బీకి చెందిన 19 సెంట్ల స్థలం ఉందని, సదరు స్థలం వివాదంలో కరీంబాబును హత్యచేసి బావిలో వేసి ఉంటారని బంధువులు ఆరోపిస్తున్నారు. అయితే సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జగనన్న సురక్షలో 98 శాతం దరఖాస్తులకు పరిష్కారం

అమరావతి: మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారంతో జగనన్న సురక్ష ముగిసింది. 16 రోజుల్లో 16 సచివాలయాల పరిధిలోని ఇరవై గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల స్థాయి అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ప్రజల సమస్యల్ని పరిష్కరించారు. మండలంలో ప్రజల నుంచి 5,200 దరఖాస్తులు రాగా, ఇందులో 5,017 దరఖాస్తుల్ని అధికారులు పరిష్కరించారు. 98 శాతం లక్ష్యాన్ని సాధించి, ఏడు వేల కుటుంబాలకు లబ్ధి చేకూర్చారు. మండల పరిధిలోని ఇరవై గ్రామాల్లో ప్రజలకు 5,017 ధ్రువీకరణ పత్రాల్ని ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అధికారులు పంపిణీ చేశారు.

సాయిరాం జప యజ్ఞం

కారెంపూడి: సత్యసాయిబాబా జన్మదిన శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక సత్య సాయి, షిరిడీ సాయి మందిరంలో ఆదివారం సాయంత్రం సామూహిక లిఖిత నామ జప మహాయజ్ఞం జరిగింది. భక్తులు పాల్గొని సాయి నామాన్ని స్మరిస్తూ పేపరుపై ఓం శ్రీ సాయిరాం అని లిఖించారు. రాత్రి వరకు ఓం శ్రీ సాయిరాం జపాన్ని భక్తులు స్మరణ చేశారు.